# సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



2



2

# ధాన్యం లారీ బోల్తా..

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## ఎల్లారెడ్డి ఏఎస్సైగా దేవాగౌడ్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఏఎస్సైగా దేవాగౌడ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర చేతుల మీదుగా ఆయన పదోన్నతి పత్రాన్ని అందుకున్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రాజిరెడ్డి, ఎస్సై మహేష్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

5-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2





# జనసంద్రం.. నింబాచలం..

శ్రీమన్నింబాచాల క్షేత్రం జనసంద్రమైంది. వేల మంది భక్తుల గోవింద నామస్మరణతో పులకించిపోయింది. భీమ్‌గల్ శివారులోని లింబాద్రి గుట్టపై లక్ష్మీ నృసింహుని రథోత్సవం కనుల పండువగా సాగింది. కార్తీకమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నంబి పార్థసారథి, నంబి విజయసారథి, నంబి వాసుదేవాచార్యులు ఇతర అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి రథ యాత్ర నిర్వహించారు.

- అక్షరటుడే, భీమ్‌గల్

– మిగతా 2వ పేజీలో..



# కార్తీక శోభ




కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలోని శివాలయాల్లో సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు ఆలయాకు పోటెత్తారు. ప్రత్యేక పూజలతో పాటు దీపారాధనలు చేశారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, శంభుని గుడి, నగరేశ్వర ఆలయంతో పాటు బోధన్ చక్రేశ్వరాలయం, ఆర్మూర్ సిద్దుల గుట్టలో భక్తుల రద్దీ నెలకొంది. మహిళలు ఉసిరి దీపాలను వెలగించి పురోహితులకు దానం చేశారు. ఇళ్లలో తులసి దామోదర కల్యాణంతో పాటు సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

– అక్షరటుడే, ఇందూరు

– మిగతా 2వ పేజీలో..

## రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం




**అక్షరటుడే, భీమ్‌గల్:** రైతుల కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో వరి పండిన రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఆమె జిల్లాలోని లింబాద్రిగుట్టపై లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముందుగా తెలంగాణ ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మానేశాయని అన్నారు. 80 శాతం అమ్మకాలు పూర్తయిన తర్వాత ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపయోగం ఏముంటుందని ప్రశ్నించారు. రైతులు ధాన్యాన్ని నష్టానికి దళారులకు అమ్ముకున్నారన్నారు. అలాగే వర్షాలకు తడిసిన ధాన్యం కొనేవాళ్లు లేక వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నాటి నింబాచలమే.. నేటి లింబాద్రి గుట్ట



లింబాద్రి గుట్టపై మొదట వేపచెట్లు ఉండేవి కనుక నింబాద్రి అనేవాళ్లని.. కవిత అన్నారు. తర్వాత కాలక్రమేణా లింబాద్రిగా పేరు వచ్చిందన్నారు. లింబాద్రి లక్ష్మీనృసింహస్వామి చాలా శక్తివంతమైన దేవుడని పేర్కొన్నారు. కేసీఆర్ నర్సింహస్వామి భక్తుడని.. గతంలో లింబాద్రి గుట్ట అభివృద్ధికి రూ. 5 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. దాంతో గుడిని అభివృద్ధి చేసుకున్నామని.. కానీ గుట్టపై మహిళలకు టాయిలెట్స్, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. గుట్ట కింద అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ పూర్తి కావడానికి రూ. 20 లక్షలు అవసరముందని ప్రభుత్వం వాటిని కేటాయించాలని కోరారు.



## మత్స్యకారుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** మత్స్యకారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. చేప విత్తనాల పంపిణీ ద్వారా మత్స్యకారుల ఆదాయం పెరగడమే లక్ష్యమన్నారు. బాన్సువాడలోని కల్కి చెరువులో బుధవారం వంద శాతం ప్రభుత్వ సబ్సిడీ చేప విత్తనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపలను దళారులకు విక్రయించవద్దన్నారు. తామే విక్రయించుకుని మత్స్యకారులు అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, పసుపుల సాయిలు, నాయకులు నారా సురేష్, ఎర్వల కృష్ణారెడ్డి, ఎజాజ్, జంగం గంగాధర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని భారీ చోరీలకు పాల్పడుతున్నారు. విలువైన వస్తువులు, బంగారం ఎత్తుకెళ్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రెక్కీ నిర్వహిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారు. పోలీసులు కట్టడి చేస్తున్నా దొంగతనాలు చేస్తూ సవాల్ విసురుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి



# రెచ్చిపోతున్న దొంగలు

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన చోరీ కేసులు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- ఇల్లు విడిచి వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు


ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇటీవల దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. అంతకుముందు చోరీ చేయాలనుకున్న ప్రాంతంలో పక్కాగా రెక్కీ నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత సీన్‌లోకి దిగుతున్నారు. తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న విలువైన బంగారం, వెండి, నగదు, ఇతరత్రా సామగ్రి దోచుకెళ్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా తమకేమీ పట్టనట్టు వచ్చిన పని చేసుకుని సాఫీగా వెళ్లిపోతున్నారు.

### భయపడుతున్న ప్రజలు

వరుస చోరీలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఏదైనా శుభకార్యానికి, ఇతర కార్యక్రమాలకు ఇల్లు వదిలి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. బయటకు వెళ్లిన ప్రతిసారి విలువైన వస్తువులు వెంట తీసుకుని వెళ్లే పరిస్థితి ఉండకపోవడంతో బీరువాలోనో లేక ప్రత్యేక లాకర్‌లోనో దాచుకుని వెళ్తున్నారు. తీరా ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లు గుల్లయిపోతుంది. దాంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

### నిఘా కరువు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిత్యం ఏదో ఒక మూల చోరీలు జరుగుతూనే ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉన్నా అనుకున్న స్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోలింగ్ చేయాల్సిన సిబ్బంది



కాలనీల వైపు వెళ్లడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి చోరీలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

### ఇటీవల జరిగిన చోరీలు

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి శివారులోని వినాయక నగర్ కాలనీలో ఓ కుటుంబం రాత్రి గాంధీనగర్ కాలనీలో ఫంక్షన్ వెళ్లి ఉదయం 5 గంటలకు తిరిగి వచ్చింది. అప్పటికే ఇంట్లో ఉన్న 9 తులాల బంగారం, వెండి, రూ.2.5 లక్షల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. ఏప్రిల్ 14 దేవునిపల్లి కృష్ణ పరివార్‌లో ఒక కుటుంబం విదేశీయాత్రకు వెళ్లి వచ్చేలోపు ఇంట్లో దొంగలు పడ్డారు. మే 19న కల్కినగర్‌లో మున్సిపల్ ఉద్యోగి సాయినాథ్ ఇంట్లో చోరీ జరిగింది. 3 తులాల బంగారం, రూ.90 వేల నగదు ఎత్తుకెళ్లారు. జులై 8న గురు రాఘవేంద్ర కాలనీలో ప్రభుత్వ ఉద్యోగి దేవరాజు శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో ఉన్న 16 తులాల బంగారం, రూ.60 వేల నగదు చోరీ చేశారు. నవంబర్ 4న దేవునిపల్లి వినాయక నగర్ కాలనీలో ఓ ఇంట్లో 6.5 తులాల బంగారం, 2.5 కిలోల వెండి, రూ.2.5 లక్షల నగదు ఎత్తుకెళ్లారు.

### నిజామాబాద్ జిల్లాలో..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ జిల్లాలో ఇటీవల దొంగతనాలు పెరిగాయి. నగరంలోని మూడో టౌన్ పరిధిలో గల ఆదర్శనగర్‌లోని హింగుళాంబిక దేవి ఆలయంలో ఇటీవల దొంగలు మూడున్నర తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహమ్మదీయ కాలనీలో రూ.ఏడు లక్షలు చోరీ అయ్యాయి. బోధన్ బస్టాండ్ సమీపంలో తాగిన మైకంలో కొందరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బాబన్ సాహెబ్ పహడ్ కాలనీలో ఇంట్లోకి దొంగలు చొరబడి 18 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బ్రాహ్మణ కాలనీలో 32 తులాల బంగారంతోపాటు ఒక కిలో వెండి చోరీ చేశారు.

## డీఈవో, ఎమ్మెల్యే పీఏకు కోర్టు నోటీసులు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ఓ ఎమ్మెల్యేకు పీఏగా కొనసాగుతున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారికి హ్యూమన్ రైట్స్ కోర్టు నోటీసులు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా శ్రీనివాస్ రెడ్డి పీఏగా విధులు నిర్వహించడంపై మోపాల్ మండలం సిర్‌పూర్‌కు చెందిన గోపాల్ అనేకసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా రెండేళ్లుగా పీఏగా విధులు నిర్వహిస్తున్నాడంటూ ప్రజావాణితో పాటు డీఈవోకు పలుసార్లు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల హ్యూమన్ రైట్స్ కోర్టుకు ఫిర్యాదు వెళ్లగా.. తాజాగా నోటీసులు జారీ చేసింది. నవంబర్ 25వ తేదీ లోపు డీఈవో, ధర్పల్లి ఎంఈవో, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. నోటీసులపై డీఈవో అశోక్‌ను వివరణ కోరగా.. తాను సెలవులో ఉండడం వల్ల నోటీసులు చూడలేదన్నారు. ఉపాధ్యాయులు పీఏలుగా పనిచేయడం నిబంధనలకు విరుద్ధమేనన్నారు. అయితే సదరు ఉపాధ్యాయుడు ప్రతి నాలుగు నెలలకోసారి ఎంఈవో వద్ద సెలవు పెడుతున్నాడని వివరించారు.



## డ్రైవింగ్ వృత్తి కాదు బాధ్యత

**అక్షరటుడే, ఇందూరు:** డ్రైవింగ్ అనేది వృత్తి కాదని.. అది ఒక బాధ్యత అని ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు, కండక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణాలు ఎంతో విలువైనవని, ఒక్క క్షణం నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీస్తుందన్నారు. ప్రతి డ్రైవర్ బయలుదేరే ముందు వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయాలన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్-2 డిపో మేనేజర్ సాయన్న, జేబీఎస్ డీఎం రవితేజ పాల్గొన్నారు.

## ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు గురువారం నాలుగు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.

ఇక నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 9,570 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 12 గేట్లకు గాను 2 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో జలాశయంలో నీరునిల్వ ఉంది.





## ‘దొంగనోట్ల కేసులో ఇరికించాలని చూస్తున్నారు..’

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కొందరు వ్యక్తులు తనను దొంగనోట్ల కేసులో ఇరికించాలని చూస్తున్నారని ఆసిఫ్ ఆరోపించాడు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రౌడీషీటర్ రియాజ్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశాడు. రియాజ్‌ను పట్టుకునే సమయంలో తన చేతులపై కత్తితో తీవ్రంగా దాడి చేశాడని పేర్కొన్నాడు. ఫేక్ కరెన్సీతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నాడు. ఓ ప్రైవేట్ ఆర్గనైజేషన్ తనపై లేనిపోని తప్పుడు ప్రచారాలు చేస్తోందని చెప్పారు. మరికొంతమంది వాట్సాప్‌లో తప్పుడు సమాచారం పంపిస్తూ తనను చంపుతానని బెదిరిస్తున్నారని వాపోయాడు. ఇప్పటివరకు తనపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని తనపై ఎలాంటి అనుమానాలు ఉన్నా తాను ఉంటున్న కాలనీకి వచ్చి ఎవరినైనా ఎంక్వైయిరీ చేసుకోవచ్చని చెప్పాడు.



## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు దేవరాం, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ఆకుల గంగారాం డిమాండ్ చేశారు. అంకాపూర్‌లో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఆర్మూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకాపూర్ డబుల్ బెడ్‌రూం స్కీంలో మొదట పేదల పేర్లు చేర్చి ఇళ్లు పూర్తయ్యాక లబ్ధిదారుల పేర్లు మార్చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. డబుల్ ఇళ్ల మంజూరులో అవకతవకలను వెలికి తీయాలని.. పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌతమి, రాజమణి, అబ్బమ్మ, సావిత్రి, రమణి, పోసాని, నర్సయ్య, గణేశ్, ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త మండల కార్యదర్శి కిషన్, అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ బాధ్యులు రాజన్న, నిఖిల్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.





## నాయక్‌పోడ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** నాయక్‌పోడ్ కులస్థులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలిన డీఎస్పీ మధుసూదన్ అన్నారు. మండలంలోని చేపూర్‌లో భీమన్న గుడిలో ఆదివాసి నాయక్‌పోడ్‌ల ఆధ్వర్యంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భీమన్న కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సాయన్న, ఆదివాసి నాయక్ పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న, జిల్లా ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి కోసెడుగు రవి, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ జడ్పీటీసీ సారంగి నడిపి సందన్న, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గంగాధర్, మాజీ సర్పంచులు పి.సత్యనారాయణ, కె.గంగారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, మాజీ ఎంపీటీసీ గంగాధర్, ఆర్మూర్ మండల ఆదివాసి నాయక్‌పోడ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో స్వామి వారికి అలంకరణ


నీలకంఠేశ్వరాలయంలో భక్తుల పూజలు

# కార్తీక శోభ











కామారెడ్డి జిల్లా గాంధారిలో..


ఆర్మూర్ పట్టణంలో..


బాన్సువాడలో..


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల శివాలయంలో..


టేక్రియాల్ తులసిపూజలో పాల్గొన్న బాలిక..


ఎల్లారెడ్డిలో..

## నింబాచలం.. జనసంద్రం..


లింబాద్రి గుట్ట రథయాత్రలో పాల్గొన్న బీజేపీ నేత పల్లె గంగారెడ్డి, నాయకులు


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

## రాష్ట్రస్థాయి ఖోఖోలో ప్రతిభ చూపాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీడీ అతిఖుల్లా, ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఖోఖో జిల్లా జట్ల ఎంపిక కోసం పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 12 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఎంపిక చేశారు. బుధవారం నిర్వహించిన శిక్షణ ముగింపు శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. జట్టు శిక్షణకు అవసరమైన వసతులు కల్పించి సహకరించిన దాతలు కవిత, దశరథం, డాకూరి వెంకట్ రెడ్డి, ఇమ్రోజ్, రమణరావులకు, అలాగే క్రీడాదుస్తులు అందించిన కొవూరి శివకుమార్, విజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో దేవిసింగ్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, ప్రియాంక, సంజీవ్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో పాల్గొననున్న



జిల్లా జట్టు క్రీడాకారులను అభినందించారు. పెద్దపల్లి జిల్లాలో జరగనున్న 58వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పెద్దపల్లి జిల్లా పరిధిలోని ఇండియన్ మిషన్ ఉన్నత పాఠశాలలో జరుగనున్నాయి.



## ఘనంగా విగ్రహాల ఊరేగింపు

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పెర్కిట్ కుక్కలగుట్ట కాలనీలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయంలో బుధవారం శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పెర్కిట్‌లోని శివాలయం నుంచి విగ్రహాలను మహిళలు మంగళహారతులు డప్పు వాయిద్యాలు నడుమ ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం గణపతి పూజ పుణ్యహవచనం నిర్వహించారు. ఈనెల 7న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తికి చేయూత..



**అక్షరటుడే, మెండోరా:** మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుపై తిరుగుతుండగా ఓ వ్యక్తి మానవత్వం చాటాడు. వివరాల్లోకి వెళ్తే.. పోచంపాడ్ నుంచి నిర్మల్‌వైపు వెళ్లే మార్గంలో బుధవారం ఓవ్యక్తి మతిస్థిమితం లేకపోవడంతో దుస్తులు లేకుండా తిరుగుతున్నాడు. అదేదారిలో వెళ్తున్న ఎండీ ఫిరోజ్ స్పందించి ఆ వ్యక్తికి సపర్యలు చేశాడు. అనంతరం అక్కడే కొత్త దుస్తులు కొనుగోలు చేసి వేశాడు. అలాగే రాత్రివేళ ఇబ్బంది కాకుండా ఉండేందుకు దుప్పట్లు సైతం కొనిచ్చాడు. ఈ సందర్భంగా ఎండీ ఫిరోజ్‌ను స్థానికులు అభినందించారు.




## కళలను పరిరక్షించుకుందాం..

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రజా కళలను పరిరక్షించుకుందామని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం అన్నారు. మండలి ఆర్మూర్ ఏరియా ముఖ్యుల సమావేశాన్ని బుధవారం ఆర్మూర్ పట్టణంలో బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఈనెల 10న నిర్వహించనున్న ఆర్మూర్ ఏరియా మహాసభలకు కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నర్సారెడ్డి, రామకృష్ణ, శంకర్, రవి, శివ, కుల్దీప్ శర్మ తదితరలు పాల్గొన్నారు.

## టోల్‌గేట్ వద్ద ధాన్యం లారీ బోల్తా..

**అక్షరటుడే, నిజామాబాద్ :** ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద బుధవారం ఉదయం బోల్తా పడింది. యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. సిరికొండ మండలం చీమన్‌పల్లి కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తీసుకొని నిజామాబాద్‌కు లారీ బయలు దేరింది. జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో ప్రమాదం జరిగింది. దీంతో లారీలోని వడ్ల సంచులు కింద పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఆ సమయంలో వెనకాల వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు. అనంతరం మరో లారీలో వడ్ల బస్తాలను తరలించారు.




## ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

**అక్షరటుడే, ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ లో ఉన్న ఆయన కార్యాలయంలో బుధవారం కామారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, రాకేష్‌రెడ్డి కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. అనంతరం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సుదర్శన్‌రెడ్డికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, పీసీసీ డెలికెట్ శేఖర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, ఐసీడీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, మాజీ ఎంపీపీ రాజన్న, మాజీసర్పంచ్ చిన్నసాయరెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి సైతం



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, వెంకట రమణారెడ్డి, రాకేశ్ రెడ్డి

సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.


ప్రభుత్వ సలహాదారును సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, అరికెల తదితరులు


సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి

## శబరిమాత ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆలయాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు బుధవారం దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నానన్నారు. పంటలు బాగా పండాలని.. అధిక దిగుబడులు రావాలని కోరుకున్నానని ఆయన తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.